క్లుప్తంగా

వైభవంగా కల్యాణోత్సవం



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

రామసముద్రం: మండలంలోని మినికి గ్రామంలో వెలసిన శ్రీకల్యాణ వెంకటరమణస్వామి ఉత్సవాలలో భాగంగా ఆదివారం శ్రీదేవి , భూదేవి సమేత వెంకటరమణస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉదయం ప్రత్యేక పూజలు, హోమాలు, కలిశారాధాన, బలిహరణ, మహా మంగళహారతి పట్టారు. రాత్రి కల్యాణోత్సవం నిర్వహించారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారి కల్యాణ తంతు తిలకించారు. ప్రత్యేజ పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

రెడ్డెమ్మకొండపై భక్తుల రద్దీ



గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. ఆదివారం ఆలయంలో అమ్మవారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సంతనాన్ని ప్రసాదించే చల్లని తల్లిగా ప్రసిద్ధిపొందిన అమ్మవారి ఆలయానికి వేకువజాము నుంచే భక్తుల సందడి మొదలైంది. ఆలయ కిందిభాగంలోని దిగువ తొట్లివారిపల్లెలో పంపిణీ చేసే ఆకు పసరును సేవించిన మహిళలు అమ్మవారి కోనేట్లో పవిత్ర స్నానమాచరించిచారు. అమ్మవారి ఎదుట సంతాన కోసం వరపడ్డారు. మొక్కులు తీరిన భక్తులు అమ్మవారికి బంగారు, వెండి, చీరెసారెలతో మొక్కులు చెల్లించుకొన్నారు. తులభారంతో బిడ్డలను తూచి అంత డబ్బులు అమ్మవారికి కానుకలుగా సమర్పించారు.

250 మందికి ఉచిత ఖత్నా



పోషకాహార కిట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

మదనపల్లె సిటీ: స్థానిక బెంగళూరు రోడ్డులోని ఈద్గాలోని మదరసాలో ఆదివారం ఉచిత ఖత్నా నిర్వహించారు. ఎమ్మెల్యే ఎం.నవాజ్ బాషా ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు. సుమారు 250 మందికి ఖత్నా చేశారు. ఖత్నా చేసుకున్నవారికి మదరసా నిర్వాహకులు పోషకాహార కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు రఫీక్‌బేగ్, ఇస్మాయిల్, ప్యారూ, బషీర్, బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నివాళి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే చింతల

వాల్మీకిపురం: పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి బంధువు చింతల సుజాతమ్మ అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పట్టణంలోని ఎల్‌ఆర్‌వీధిలోని మృతురాలి స్వగృహానికి చేరుకొని మృతదేహం వద్ద నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, సానుభూతి తెలిపారు. ఎమ్మెల్యే చింతల వెంట చింతల శ్రీధర్ రెడ్డి, చింతల శివానంద రెడ్డి, నీళ్లభాస్కర్, కేశవ రెడ్డి, మానవతా సంస్థ జిల్లా అధ్యక్షులు క్రిష్ణమూర్తి, తదితరులు ఉన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

మదనపల్లె సిటీ: క్రీడలు మానసిక ఉల్లాసం కలిగిస్తాయని, ప్రతి ఒక్కరూ క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాని హాకీ సీనియర్ కోచ్ ప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా క్రీడాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత హాకీ శిబిరంలో పాల్గొన్న క్రీడాకారులు 3 కె రన్ నిర్వహించారు. శిబిబిరంలో హాకీలో మెళుకవలు నేర్పించడం జరుగుతుందన్నారు. దీన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రిటైర్డు ట్రాన్స్‌కో ఏఈ హరిబాబు క్రీడాకారులకు అల్పాహారం అందజేశారు. కార్యక్రమంలో కోచ్ నౌషాద్, వంశీ, పవన్ పాల్గొన్నారు.



3కే రన్‌లో హాకీ క్రీడాకారులు

సంక్షేమ సారథుల సేవలకు సలాం

- వరుసగా మూడో ఏడాది అవార్డులు అందజేత
- ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



అవార్డులు అందుకున్న వలంటీర్లతో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

వాల్మీకిపురం: అవినీతికి తావు లేకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలను నేరుగా ప్రజల ఇంటి ముంగిటికే వెళ్లి అందించడం, పారదర్శకంగా పథకాలను లబ్ధిదారులకు అందేలా ముఖ్యమంత్రి వైఎస్‌జగన్మోహన్ రెడ్డి వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చారని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో వలంటీర్లకు బహుమతిని అందించి, సన్మానించారు. సేవా మిత్రకు రూ.10 వేలు, సేవా రత్నకు రూ.20వేలు చొప్పున ఏటా నగదు పురస్కారం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతల మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేసేందుకే వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చారన్నారు. రాజకీయాలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తున్నామన్నారు. నవరత్నాల ద్వారా పేద ప్రజలకు సంక్షేమ పథకాలు ఇంటి ముంగిటకే అందుతున్నాయని తెలిపారు. వాలంటీర్లు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధులన్నారు. ముఖ్యమంత్రి ప్రవేశ పెట్టిన వలంటీర్ వ్యవస్థను ఆదర్శంగా తీసుకొని అన్ని రాష్ట్రాల్లో ఈ వ్యవస్థ ఏర్పాటు చేసేందుకు ఆయా ప్రభుత్వాలు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాయన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి తమకు ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించడమే కాక తమ సేవలను గుర్తించి ఏటా అవార్డు, నగదు బహుమతులు ఇచ్చి ప్రోత్సహిస్తుండటం చాలా సంతోషంగా ఉందని వలంటీర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహంతో ప్రజలకు మరింత బాధ్యతగా ఉత్సాహంగా సేవలు అందిస్తామని వలంటీర్లు చెబుతున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో షబ్బీర్ అహ్మద్, జెడ్పీటీసీ నిర్మల, నాయకులు చింతల ఆనంద రెడ్డి, కేశవరెడ్డి, నీళ్లభాస్కర్, వెంకట్రమణ, కిరణ్ కుమార్, రాయుడు, శ్రీధర్‌రాయల్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.

మరింత బాధ్యతగా సేవలందిస్తా



రెండు సార్లు సేవా మిత్ర అవార్డులు అందుకున్నాను. నా సేవలు గుర్తించి ప్రభుత్వం ఇప్పుడు సేవా రత్న అవార్డు అందించడం సంతోషంగా ఉంది. సీఎం జగనన్న ఇచ్చిన ఈ ప్రోత్సాహంతో మరింత బాధ్యతగా సేవలు అందిస్తాను. వలంటీర్‌గా ప్రజలకు సేవ చేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నాను.

- సిద్ధిక్, వలంటీర్, నాయక్‌వీధి

ప్రజలకు సేవ చేయడ అదృష్టం



వలంటీర్‌గా ప్రజలకు సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నాను. సేవా రత్న అవార్డు రావడం మరింత సంతోషాన్ని ఇస్తోంది. నేను రెండు సార్లు సేవా మిత్ర అవార్డులు అందుకున్నాను. ప్రజలకు సేవ చేస్తూ ప్రభుత్వం నుంచి అవార్డు అందుకోవడం చాలా అదృష్టంగా భావిస్తున్నాను.

- స్వరూప రెడ్డి, గండబోయనపల్లి

సేవ చేసే అవకాశం కలిగింది



రెండు సార్లు సేవా మిత్ర అవార్డులు అందుకున్నాను. మూడోసారి సేవా మిత్ర అవార్డు అందుకోవడం సంతోషంగా ఉంది. ప్రజలకు అందిస్తున్న సేవలను గుర్తించి ప్రభుత్వం ప్రతి ఏడాది వలంటీర్లకు అవార్డులు, నగదు ప్రోత్సాహకాలు అందిస్తుండటం గొప్ప విషయం. నా పరిధిలో కుటుంబాలకు మరింత మెరుగ్గా సేవలు అందించేందుకు కృషి చేస్తా.

- లీలావతి, వలంటీర్, తిరుచుట్టివీధి

ఘనంగా గంగమ్మ తిరునాల

తంబళ్లపల్లె: మండలంలోని గోపిదిన్నె పంచాయతీ ఉప్పులూరివాండ్లపల్లె సమీపంలో వెలసిన శ్రీగిండి గంగమ్మ ఆలయంలో ఆదివారం వైభవంగా తిరునాల జరిగింది. కొత్తపల్లెకు చెందిన గిండి వంశస్తులు ఇలవేల్పు ఆడపడుచుకావడంతో సంప్రదాయబద్ధంగా పట్టువస్త్రాలు, పసుపుకుంకుమ, నైవేద్యాలను ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి మహిళలకు ఉపవాసాలతో జ్యోతులు, బోనాల ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. రాత్రి విద్యుత్‌దీపాలతో అలంకరించిన చాందినీబండ్ల మెరవని, బజనలు, కోలాటాలు, డ్యాన్సులతో ఊరేగింపు నిర్వహించారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడులు

మదనపల్లె : మండలంలోని పుంగనూరురోడ్డు గ్రీన్‌ల్యాండ్ దాబా ఎదురుగా యాతాలవంక వద్ద పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో రూరల్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఎస్‌ఐ సుధాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన దాడుల్లో ఏడు గురిని అరెస్ట్ చేయడంతో పాటుగా వారి వద్ద నుంచి రూ.24,350 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ పేకాట ఆడటం, అసాంఘిక కార్యక్రమాలకు ఎవరు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఉచిత మెగా వైద్యశిబిరానికి స్పందన



లయన్స్‌క్లబ్ ప్లాటినమ్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం

పీలేరు రూరల్ : పీలేరు లయన్స్‌క్లబ్ ప్లాటినమ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఆదివారం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 250 మందికి గుండె, జ్వరం, బీపీ, షుగర్, దంత, కంటి, తదితర విభాగాల్లో వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్ ప్లాటినమ్ అధ్యక్షులు బలసా వేణుగోపాల్ మాట్లాడుతూ వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఏకాంతం రెడ్డి, కోశాధికారి మహమ్మద్ షఫీ, జిల్లా కార్యదర్శి సంజీవరెడ్డి, సభ్యులు రామకృష్ణారెడ్డి, మల్లికార్జునరెడ్డి, యర్రమరెడ్డి, శ్రీహరిరెడ్డి, హరి, వైద్యులు నౌషాద్, హర్షిత రెడ్డి, చరణ్‌కుమార్‌రెడ్డి, మౌర్యరెడ్డి, సుచరిత తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా బట్టీలపై ఎస్‌ఈబీ దాడులు



సీటీఎం పాలెంకొండలో బెల్లంఊటను ధ్వంసం చేస్తున్న ఎస్ఈబీ అధికారులు

మదనపల్లె : మదనపల్లె మండలం సీటీఎం గ్రామానికి సమీపంలోని చెరువుకట్ట కింద దట్టమైన ముళ్లపొదల్లో అక్రమంగా నాటుసారా తయారీ జరుగుతోందన్న సమాచారం మేరకు ఆదివారం ఇన్‌చార్జ్ సీఐ శ్రీహరిరెడ్డి ఆధ్వర్యంలో ఎస్‌ఈబీ అధికారులు దాడులు నిర్వహించారు. బెల్లపుఊట, సారా తయారీకి వినియోగించే సామగ్రి, ఊట నిల్వ చేసిన డ్రమ్ములను గుర్తించారు. దీంతో అక్కడికక్కడే ఎస్‌ఈబీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సుమారు 800 లీటర్ల బెల్లంఊటతో పాటుగా ప్లాస్టిక్ డ్రమ్ములను ధ్వంసం చేశారు. నాటుసారా తయారీదారుడుగా పాలెంకొండకు చెందిన గల్లారవికుమార్(40)ను గుర్తించి కేసు నమోదు చేశారు. దాడుల్లో బీఎంపీపీ ఎస్‌ఐ సి.రాజశేఖర్, సిబ్బంది దామోదర్, ప్రసన్న కుమార్, రూప్‌కుమార్, బాలకృష్ణ పాల్గొన్నారు.

ఎంపీ నిధులతో బోరు, మోటారు ఏర్పాటు



నూతన బోరుకు మోటారు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

పీలేరు : మండలంలోని కాకులారంపల్లె పంచాయతీ ఇందిరమ్మ కాలనీ సమీపంలోని శ్రీ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి బిస్మిల్లా ఆటో కార్మికుల కాలనీకి రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి సొంత నిధులు రూ. 3.50 లక్షలతో బోరు, మోటారు, పైపులైన్లు ఏర్పాటు చేసి ఆటో నగర్‌కు తాగునీరు అందించారు. ఆటో కార్మికులు ఎంపీతోపాటు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ హరిణి సురేష్‌కుమార్‌రెడ్డి, ఆటో యూనియన్ అధ్యక్షులు బోదేషావలి, నౌలక్, హుస్సేన్, ఇస్మాయిల్, శీను తదితరులు పాల్గొన్నారు.

దళితుల అభివృద్ధికి భూపంపిణీ చేపట్టాలి



మాట్లాడుతున్న గుర్రం నారాయణ

పీలేరు రూరల్ : దళితులు అభివృద్ధి చెందాలంటే ప్రభుత్వం భూ పంపిణీ చేపట్టాలని మాలమహానాడు ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుర్రం నారాయణ అన్నారు. ఆదివారం స్థానిక మాల మహానాడు ఐక్యవేదిక కార్యాలయంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత విద్యాభ్యాసంతోనే దళితులు అభివృద్ధి చెందుతారని తెలిపారు. రాజ్యాంగం ప్రసాదించిన దళితుల హక్కులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా నక్క వెంకటరమణ, ఉమ్మడి జిల్లా కనీవ్వనర్‌గా దామోదర్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా రామాంజులు, జిల్లా ఉపాధ్యక్షులుగా బెల్లం రమేష్, జిల్లా కార్యదర్శిగా మద్దెల రమేష్, జిల్లా కోకన్వీనర్‌గా శేఖర్ తోపాటు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. లీగల్ సెల్ ఛైర్మన్ విశ్వకాంత్‌బాబు, తిరుపతి జిల్లా అధ్యక్షులు మహేష్, ఉమ్మడి జిల్లా కార్యదర్శి మురళి, ఉపాధ్యక్షులు శివకుమార్ పాల్గొన్నారు.

మోడల్ స్కూల్లో ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తులు

కేవీపల్లె : స్థానిక ఏపీ మోడల్ స్కూల్లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశానికి దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ రెడ్డిప్రదీప్ తెలిపారు. పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఇంటర్ ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపులలో విద్యనభ్యసించుటకు జూన్ 7వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పదవ తర గతి మార్కులు, రిజర్వేషన్ ప్రాతిపదికన సీట్లు కేటాయించనున్నట్లు తెలిపారు.

ఉచిత కంటి వైద్య పరీక్షలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

పీలేరు రూరల్ : పీలేరు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఆదివారం స్థానిక ప్రసాద్ హాస్పిటల్‌లో తిరుపతి శ్రీ వెంకటేశ్వర అరవింద్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 120 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, 30 మందిని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేసినట్లు లయన్స్‌క్లబ్ అధ్యక్షులు సదాశివరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ కార్యదర్శి మహేష్ గుప్తా, ట్రెజరర్ ఈశ్వర్‌రెడ్డి, డాక్టర్ ప్రసాద్, సభ్యులు సురేంద్రనాథరెడ్డి, సుబ్రమణ్యం, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పురస్కారానికి గురుకుల పాఠశాల విద్యార్థిని ఎంపిక



ఎం.హారిక

కలికిరి: పదవ తరగతి ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన కలికిరి జ్యోతిబా పూలే వెనుకబడిన తరగతుల బాలికల గురుకుల పాఠశాల విద్యార్థిని ఎం.హారిక ప్రభుత్వం ప్రకటించిన జిల్లా స్థాయి పురస్కారానికి ఎంపికైంది. మండలంలోని పత్తేగడ గ్రామం కొండకావలి వారిపల్లి విద్యార్థిని హారిక 5వ తరగతి నుంచి గురుకుల పాఠశాలలో చదువుతోంది. ఈ నెల 27న జిల్లా కేంద్రం రాయచోటిలో జరుగనున్న కార్యక్రమంలో విద్యార్థినికి రూ.30వేల నగదు, ప్రశంసా పత్రం అందజేసి సత్కరించనున్నారు. జిల్లా స్థాయి పురస్కారానికి ఎంపికై న విద్యార్థినిని పాఠశాల ప్రిన్సిపాల్ వై.సోమశేఖర్, ఉపాధ్యాయులు అభినందించారు.

అభివృద్ధికి నిధులు కేటాయించాలని వినతి



మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్ హబీబ్‌బాషా

పీలేరు : మేజర్ గ్రామ పంచాయతీ పీలేరు అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి సర్పంచ్ హబీబ్‌బాషా విన్నవించారు. ఆదివారం పీలేరులో మంత్రి వివాహ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రిని కలసి పంచాయతీలోని సమస్యలపై వివరించారు. పట్టణంలో అవసరం మేరకు సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు ఏర్పాటుకు నిధులు అవసరమని తెలిపారు. అలాగే పారిశుద్ధ్య కార్మికుల సంఖ్య పెంచడానికి సహకరించాలని కోరారు. సానుకూలంగా స్పందించి మంత్రి తమ సహకారం ఎల్లప్పుడు ఉంటుందని హామీ ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఎ.ఎస్. హుమయూన్ పాల్గొన్నారు.

మైనార్టీల అభివృద్ధి వైఎస్సార్‌సీపీతోనే సాధ్యం

వాల్మీకిపురం: మైనార్టీల అభివృద్ధి వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమని అటవీ, విద్యుత్, భూగర్భవనరుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. వాల్మీకిపురం పట్టణంకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు అబ్దుల్ కలీమ్ ఉర్దూ అకాడమీ డైరెక్టర్‌గా నియమితులైన నేపథ్యంలో ఆదివారం సదుంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందించి, శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం జగన్ ప్రభుత్వం ఉర్దూను రెండో అధికార భాషగా అమలు చేస్తోందని, ఉర్దూ సాహిత్యం, భాషాభివృద్ధికి ఉర్దూ అకాడమీ ఆధ్వర్యంలో విస్తృత స్థాయిలో కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం అటు పాలనలోనూ, ఇటు సంక్షేమ పథకాల అమలులోనూ మైనార్టీలకు ప్రాధాన్యత కల్పిస్తోందన్నారు.

ఘనంగా ఆదిగంగమ్మ జాతర



ఆదిగంగమ్మ జాతరలో చాందినీబండి

కేవీపల్లె : మండలంలోని జిల్లేళ్లమంద పంచాయతీ పెండ్లిపెంటలో శ్రీ ఆదిగంగమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. ఆదివారం అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ, పూజలు చేపట్టారు. సాయంత్రం నుంచి చాందినీబండ్ల ఊరేగింపు అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. మిరుమిట్లు గొలిపే విద్యుద్దీపాలంకరణతో చాందినీ బండ్లు గ్రామం నుంచి అమ్మవారి ఆలయం వరకు బళ్లారి డ్రమ్స్, పిల్లనగ్రోవి, చెక్కభజనలు, కోలాటాలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలు, పెద్ద ఎత్తున బాణాసంచాతో ఊరేగింపు చేపట్టారు. భక్తులు దీలు, బోణాలతో అమ్మవారి ఆలయ ప్రదక్షిణలు నిర్వహించి మొక్కుబడులు చెల్లించారు. కార్యక్రమంలో మంగివారి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులపై వివక్ష చూపరాదు



కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పీలేరు రూరల్ : ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులపై వివక్షత చూపరాదని కోర్ సంస్థ అధ్యక్షురాలు సుమలత అన్నారు. ఆదివారం జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సహకారంతో అంతర్జాతీయ ఎయిడ్స్ స్మారక దినమున స్థానిక పంచాయతీ మిట్ట నుంచి క్రాస్ రోడ్డు వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో బలమైన వ్యవస్థను నిర్మించడానికి హెచ్‌ఐవీతో జీవించేవారిపట్ల ప్రేమ, సంఘీభావంతో మెలగాలని కోరారు. ఎయిడ్స్‌తో మృతి చెందిన వారికి ఆత్మశాంతి చేకూరాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోర్ సంస్థ సిబ్బంది సద్దాం, హసీనా, రాజమ్మ, మోహన్, తులసి, వైద్య, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ వ్యాధి గ్రస్తులతో ప్రేమగా మెలగాలి

వాల్మీకిపురం: హెచ్‌ఐవీ వ్యాధి గ్రస్తులతో ప్రేమగా మెలగాలని డాక్టర్ సోని అన్నారు. అంతర్జాతీయ ఎయిడ్స్ కొవ్వొత్తుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక ప్రభుత్వాసుపత్రి వద్ద ఐసీటీసీ కౌన్సిలర్ లోకేష్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌ఆర్‌ఎస్ సంస్థ ప్రతినిధులు లతాంజలి, శ్రీలక్ష్మి, సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఈదురు గాలుల బీభత్సం



కలికిరి: కొటాల వద్ద పెనుగాలులకు లేచిపోయిన ఇంటి పైకప్పు రేకులు



నిమ్మనపల్లె : సైదాపేట సమీపంలో రోడ్డుకు అడ్డుగా పడిన చింతచెట్టు



బాపనపల్లె వద్ద పొలాల్లో విద్యుత్ లైన్లపై విరిగిపడిన చెట్టు

నిమ్మనపల్లె : తీవ్రమైన ఈదురుగాలుల తాకిడికి మండలంలోని పలుచోట్ల వృక్షాలు విరిగి నేలకు పడ్డాయి. ఆదివారం సాయంత్రం సుమారు 4 గంటల సమయంలో వీచిన తీవ్రమైన ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. గాలులతో పాటు మోస్తరు వర్షం కురిసింది. గాలుల తాకిడికి నిమ్మనపల్లె-కందూరు రోడ్డు మార్గంలో పలుచోట్ల రోడ్డుకు అడ్డుగా చెట్లు విరిగిపడ్డాయి. కందూరురోడ్డు మార్గంలో సైదాపేటకు సమీపంలో చింతచెట్టు విరిగి రోడ్డు మీద పడటంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

పెనుగాలులతో వర్షం

కలికిరి: మండలంలో పెనుగాలులతో కూడిన వర్షం కురిసింది. పత్తేగడ గ్రామం కొటాలకు చెందిన రైతు పి.విజయ్‌కుమార్ ఇంటికి అమర్చిన పైకప్పు రేకులు లేచిపోయాయి. దీంతో ఇంట్లో ఉంచిన 35 బస్తాల వరి ధాన్యం పూర్తిగా వర్షానికి తడిసి ముద్దయింది. బాధిత రైతు లబోదిబోమని వాపోయాడు. అకాలవర్షం తీవ్ర నష్టాన్ని మిగిల్చిందని ఆవేదన వ్యక్తం చేశాడు. రెవెన్యూ అధికారులకు సమాచారమిచ్చాడు. అలాగే మండల పరిధిలో పలు చోట్ల మామిడి కాయలు నేలరాలాయి. పంట చేతికి వచ్చే సమయంలో ఇలా పెనుగాలులకు నేలరాలుతుండటంతో మామిడి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

కురబలకోట: మండలంలో ఆదివారం సాయంత్రం వీచిన పెనుగాలులకు అంగళ్లు, తెట్టు, బాపనపల్లె తదితర గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు వంగాయి. విద్యుత్ లైన్లపై చెట్లు విరిగిపడడంతో విద్యుత్‌కు ఆ ప్రాంతాల్లో అంతరాయం ఏర్పడింది. పునరుద్ధరిస్తున్నట్లు విద్యుత్ శాఖఅధికారులు తెలిపారు.

రోడ్డుభద్రతా నియమాలను పాటించండి



రోడ్డుభద్రతపై సూచిక బోర్డు ఏర్పాటు చేస్తున్న ఎస్ఐ పి.రామకృష్ణ

నిమ్మనపల్లె : ద్విచక్ర వాహనదారులు రోడ్డుభద్రతా నియమాలను పాటించాలని స్థానిక ఎస్‌ఐ పి.రామకృష్ణ తెలిపారు. రోడ్డు భద్రతా నియమాలపై వాహనదారులకు మరింత అవగాహన కల్పించేందుకు ఆదివారం నిమ్మనపల్లె-మదనపల్లె రోడ్డు మార్గంలో ప్రమాదకర మలుపుల వద్ద సూచిక బోర్డులను ఏర్పాటు చేశారు. దీంతోపాటుగా ఇటీవలే ప్రమాదకర మలుపుల్లో పిచ్చిమొక్కలను తొలగించామన్నారు. రోడ్డుపై ప్రయాణించే ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలన్నారు. మితిమీరిన వేగంతో వాహనాలు నడపవద్దని, అతివేగంతో ప్రమాదాలను కొనితెచ్చుకోవద్దని సూచించారు. మద్యం సేవించి వాహనాలను నడపవద్దని కోరారు. రాత్రివేళల్లో ప్రయాణించే వాహనాలకు తప్పనిసరిగా లైట్లు ఉండాలన్నారు. హెల్మెట్ తప్పక ధరించాలన్నారు. ప్రమాద సూచిక బోర్డులు సురక్షిత ప్రయాణానికి దోహదం చేస్తాయన్నారు. వాహనాలు నడిపేవారు డ్రైవింగ్‌లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్ పత్రాలు తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. మైనర్లు వాహనాలు నడిపితే వారి తల్లిదండ్రులు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ముమ్మరంగా వాహనాలను తనిఖీ చేస్తామని, నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదుచేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ చక్రవర్తి, కానిస్టేబుల్ కేశవ, రాజేష్, సుధాకర తదితరులు పాల్గొన్నారు.